

# బిజినెస్

ఎ.వి.వి.ఎస్.ఎస్.ప్రసాద్

మేమందరం చిదంబరం కేసి చూశాముఆశ్చర్యంగా,నమ్మలేనట్లుగా

"అవును...డ్యామ్ ష్యూర్... ఆ లాటరీలో బంపర్ బహుమతి నాకే" అన్నాడు మరోసారి ధీమాగా-

"ఎలా?" ప్రశ్న ఎలా వేయాలో తెలీలేదు నాకు.

"నో మోర్ క్వశ్చన్స్... —ఆ రోజు వరకు ఆగండి... అప్పుడు చూడండి... రాకపోతే అడగండి..." అన్నాడు నేనడిగిన ప్రశ్నని దాటేస్తూ- "నిన్న రాత్రి ఏమైనా కలొచ్చిందా?" ఆసక్తిగా అడిగాడు శ్రీకృష్ణ.

"డోంట్ బీ సిల్లీ... లెటస్ ఎంజాయ్..." అంటూ బాటిల్ ఓపెన్ చేశాడు.

"ఛీర్స్"

నాకంతా ఆశ్చర్యంగా వుంది. ఈ మధ్యే ఈ 'క్లబ్'లో మెంబరయ్యాను. చిదంబరం మా అందరిలోను అనుభవజ్ఞుడు

ఈ వూరు వచ్చినప్పుడు తినడానికి తిండి లేని స్థితిలో వున్న మనిషి. ప్రస్తుతం 'లీడింగ్ బిజినెస్ మాగ్నెట్' అయ్యాడంటే అతని తెలివితేటల్ని అంచనా వేయచ్చు!

నేను గొప్పవాళ్ళకి, బీదవాళ్ళకి మధ్య 'త్రిశంకు స్వర్గ (నరక)ంలో' బతుకుతున్నవాడ్ని. చాలా చిన్న బిజినెస్ నాది. సుధాకరమని ఓ మిత్రుడి ద్వారా ఈ 'క్లబ్'లో జేరాను.

ప్రతీ ఆదివారం ఇక్కడికి చాలా మంది 'బిజినెస్ మెన్' వస్తారు. వాళ్ళతో గడపడం చాలా ఆసక్తికరంగానే గాక ఆనందంగానూ వుంటుంది.

ఇవాళ చిదంబరం క్లబ్ కొస్తూనే-

"మై డియర్ ఫ్రండ్స్... ఫలానా షాప్‌వాడు దీపావళి బంపర్ డ్రాకి పెట్టిన 'మారుతీకార్' నా కొస్తోంది" అంటే నేనే కాదు మిగిలినవారందరూ కూడా ఆశ్చర్యపోయారు.

జనాలందరి సమక్షంలో ఒక న్యాయమూర్తి తీసే ఆ 'డ్రా'లో చిదంబరానికే వస్తుందని నమ్మకమేమిటి?

'సేల్స్ ఎక్కువగా వుండడం కోసం 'ఫలానా షాప్‌వాడు' 'మారుతీకార్' ఏకైక బంపర్ బహుమతిగా పెట్టాడు.

నిజం చెప్పొద్దూ... నేనూ ఆ 'కారు' కోసం ఆశపడి మూడు వందల రూపాయిల బట్టలు కొన్నాను. (కనీసం రెండు వందల రూపాయిల బట్టలు కొంటే 'లాటరీ కూపన్' యిస్తారు)

ఇవాళ చిదంబరం నా ఆశని 'నిరాశ' చేశాడు.

తనకీ 'కారు' వస్తుందని బల్ల గుద్ది మరీ చెప్తున్నాడు.

పాతికోసారి "ఎలా" అని అడిగితే-

"ఆ రోజు వరకు చూడవోయ్... కంగారెందుకు?" అన్నాడు ఆ రోజు...

రానే వచ్చింది!

నా లాంటి చాలా మంది 'జనం' ఆశగా 'డ్రా' జరుగుతున్న స్థలానికి చేరుకున్నారు.

ప్రముఖ న్యాయమూర్తి డ్రా తీస్తున్నారు.

డ్రా తీశాకా-

ఎవరి నెంబరో చదివారు.

కలకలంలో స్పష్టంగా వినిపించలేదు.

ఐదు నిమిషాల తరువాత ఆ కలకలంలో అంతటి హడావిడిలోను స్పష్టంగా

"...ఆ లక్కీ నెంబర్ కల వ్యక్తి... శ్రీ చిదంబరం... బిజినెస్ మాగ్నెట్... ఎస్.పి. రోడ్... సికింద్రాబాద్..."

ఏద్వలేక నవ్వినట్టు అంతా చప్పట్లు కొడ్తున్నారు.

అందరిలోను, దర్జాగా, హుందాగా చిదంబరం వెళ్ళి, చప్పట్ల మధ్య 'కార్ కీ' అందుకున్నాడు.

చెప్పి, మరీ చేశాడు.

ఎలా?

అదృష్టాన్ని కూడా అనుకూలంగా మార్చుకునే వాళ్ళున్నారా?

'వున్నారు!' అనిపించింది చిదంబరాన్ని చూశాక! చాలా రోజుల వరకు చిదంబరం ఆ అదృష్టాన్ని తన వైపు ఎలా తిప్పుకోగలిగిందీ ఎవరికీ చెప్పలేదు.

మొన్నీ మధ్య-

మరీ 'బలవంత పెట్టి' అడిగితే, మెల్లగా నా చెవిలో "చూడవోయ్ ప్రసాదూ... లాటరీలో కూడా చిన్న బిజినెస్ ట్రిక్ చేశానంతే... నీ దగ్గర వున్న 'ప్రొడక్ట్' కసలు విలువ లేదనుకో... నీకు ఎంత వచ్చినా అది లాభమే... ఇదీ అంతే" అన్నాడు నవ్వుతూ. అర్థం కానట్టు చూశాను. వివరంగా చెప్తూ-

"మినిమమ్ ఇంత ఖరీదు బట్టలు కొంటే 'లాటరీ కూప్' యిస్తానన్నాడా షాపువాడు" లాటరీ పెట్టింది సేల్స్ పెరగడం కోసం. కారు కొనడానికి ఖర్చు పెట్టింది సేల్స్ మీద లాభంలో కొంత శాతమే. ఏ మాత్రం 'రిబేటు' యివ్వకుండా, సేల్స్ పెరగడానికి అతను వేసిన ప్లాన్ లాటరీ... అదే 'బిజినెస్ ఆర్ట్' అంటే..." అని క్షణం ఆగి-

"నేను ఆ షాపువాడితో ఒకటే చెప్పాను. 'లాటరీలో బహుమతి ఎవరికి వస్తే వాళ్ళకి 'కారి'స్తావ్...దాని వల్ల వచ్చే లాభం కేవలం సేల్స్ మీద వచ్చిందే... అలా కాకుండా 'నేను నీకో పాతిక వేలు' యిస్తాను. లాటరీలో నాకు 'కారు' వచ్చేటట్టు చేస్తే...నీకు పాతికవేలు ప్రత్యేక లాభం... నాకు పాతిక వేలకే కారు...' అన్నాను. అంతే..." అన్నాడు నవ్వుతూ, 'బిజినెస్ గీత' బోధిస్తున్న శ్రీ కృష్ణుడి అపర అవతారంలా-

ఇప్పుడు నాకో నిజం తెలిసింది-

అదే-

'అదృష్టంతో కూడా బిజినెస్ చెయ్యొచ్చు!